క్లుప్తంగా

ప్రతిభ వెలికితీయడానికే 'ఆడుదాం.. ఆంధ్రా'



అవగాహన ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ సీపీ భవాని, వీసీలు నైరుతి, మైమూన్, అధికారులు

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలోని యువతీ, యువకుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడానికే సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం..ఆంధ్రా పోటీలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్‌లు పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రాతో ఆనందం, ఆరోగ్యంతో పాటు ఆటలో రాణించేందుకు ఓ చక్కటి వేదికన్నారు. సెల్‌ఫోన్లు, ట్యాబ్లు, కంప్యూటర్లకు అతుక్కుపోయిన యువతీ, యువకులు ఆడుదాం ఆంధ్రా ద్వారా దేహధారుడ్యాన్ని పెంపొందించుకోవడంతో క్రీడల్లో ప్రతిభను ప్రదర్శించవచ్చని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



గ్యాస్ సిలిండర్ నుంచి ఎగిసి పడుతున్న మంటలు

గుత్తి: పట్టణంలోని బండగేరిలో గ్యాస్ సలిండర్ నుంచి మంటలు చెలరేగిన ఘటనలో ప్రమాదం తప్పింది. వివరాలు...బండగేరిలో నివాసముంటున్న వెంకమ్మ ఇంటిలో శనివారం గ్యాస్ సిలిండర్ నుంచి ఉన్న ఫళంగా మంటలు చెలరేగాయి. స్థానికుల సాయంతో మంటలు ఆర్పడానికి వెంకమ్మ కుటుంబ సభ్యులు ప్రయత్నించారు. అయినా మంటలు ఆరిపోకపోగా మరింతగా ఎగిసిపడ్డాయి. భయంతో బయటకు పరుగులు తీశారు. చివరకు గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న వెంకటేశ్వరి

గుంతకల్లు: క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని జిల్లా బాలల సంరక్షణ విభాగం ఇంచార్జ్, డీసీపీఓ వెంకటేశ్వరి పేర్కొన్నారు. శనివారం స్థానిక రైల్వే హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ మధుసూదన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీర్‌బాల్ దివస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ వీర్ బాల్ దివస్‌పై పంపిన సందేశాన్ని వినిపించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి మై భారత్ పోర్టల్ ద్వారా అప్లోడ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లావణ్యకుమార్, మున్న, షాహిదా, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



గుత్తిలో బహుమతి అందిస్తున్న పాస్టర్

గుత్తి: స్థానిక జంగాల కాలనీలో పాస్టర్ రెవరెండ్ ధర్మేంద్ర సింగ్ ఆధ్వర్యంలో శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు.క్రిస్మస్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ ధర్మేంద్ర సింగ్ ఏసు గొప్పతనాన్ని, జీవిత చరిత్రను వివరించారు. క్రైస్తవ సంఘం నాయకులు ప్రకాష్, రాజ్‌కుమార్, జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.
పామిడి: పట్టణ సీఎస్ఐ చర్చిలో శనివారం రాత్రి క్యాండిల్‌లైట్ సర్వీసు ఆరాధనను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్యాండిల్‌లైట్ ప్రాముఖ్యతను ఆయన వివరించారు. అనంతరం క్రైస్తవులు విద్యుత్‌దీపాలను ఆర్పివేసి ఒకరికొకరు క్యాండిల్స్ అంటించుకొని ప్రార్థనల నడుమ ఈ సర్వీసును ఆచరించారు. చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, సభ్యులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని చైతన్యస్కూల్‌లో శనివారం క్రిస్మస్, జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పిల్లల క్రీస్తు, దూతలు, గొల్లల వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థుల రైతన్నల వేషధారణతో అలరించారు. క్రిస్మస్, జాతీయ రైతు దినోత్సవ ప్రాముఖ్యతను స్కూల్ సీఈఓ సంతోష్‌రెడ్డి వివరించారు.

గోవిందా...గోవిందా!

- ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు
- వైకుంఠ ద్వార శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



తాడిపత్రిలో స్వామి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు



తాడిపత్రిలో గరుడ వాహనంపై చింతల రమణస్వామి

గుంతకల్లు టౌన్: గోవింద నామస్మరణతో పట్టణంలోని రాజేంద్రనగర్ పులకించిపోయింది. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి వారిని ఉత్తరద్వారం దర్శనానికి వందలాది సంఖ్యలో భక్తాదులు పోటెత్తారు.శనివారం తెల్లవారుజామున ఆలయ అర్చకులు శ్రీవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం వైకుంఠద్వార ప్రవేశానికి అనుమతిచ్చారు. ఉదయం నుంచి శ్రీవారి దర్శనానికి భక్తాదులు బారులు తీరారు. ఈసందర్భంగా తమిళనాడు వేలూరు, ఆర్కాడు, పళ్లిపట్టు ప్రాంతాలకు చెందిన కళాకారులతో వైకుంఠంలో ఆదిశేషునిపై శ్రీవారిని, శ్రీదేవి, భూదేవి, సరస్వతి, బ్రహ్మ, పార్వతీ, పరమేశ్వరులు నారదతుంబుర మొదలగు వారి సమేతంగా విశేష పుష్పాలతో అలంకరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, పట్టణ ప్రముఖులు, అధికారులు స్వామిని దర్శించుకున్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ భక్తమండలి అధ్యక్షులు ఎం.భాస్కర్‌రంగయ్య, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, కార్యదర్శి నారాయణస్వామి, కోశాధికారి సుధాకర్ గుప్త, జయంతి వెంకట్ భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అలాగే అతి పురాతనమైన కోదండరామస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ వైఎస్.బసిరెడ్డి, కమిటీ సభ్యులు, ఆలయ ఈఓ మఠం మల్లికార్జునలు భక్తాదులకు సేవలందించారు.
గుంతకల్లు: ఎన్.తిమ్మాపురంలో వెలిసిన కావేటి వేణుగోపాల స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు ఆదిశేషయ్య అధ్వర్యంలో వేకువజామునే మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించి విశేషాలంకరణ గావించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, ఎమ్మెల్యే వైవీఆర్ రెండో కుమార్తె నిషితరెడ్డి స్వామి దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. గ్రామ పెద్దలు వారికి శాలవ, పూలమాలతో సత్కారించి తీర్థప్రసాదలను అందజేశారు.
గార్లదిన్నె: గార్లదిన్నె, మర్తాడు, కేశవాపురం, కల్లూరులోని వేంకటే శ్వరస్వామి ఆలయాల్లో శనివారం ముక్కోటి ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాల వద్ద బారులు తీరి ఉత్తర ద్వారం గుండా దర్శనం చేసుకున్నారు.
నార్పల: వైకుంఠ ఏకదశి సందర్భంగా శనివారం స్థానిక చెన్నకేశవస్వామి దేవాలయంలో పూజలు అంగరంగ వైభవంగా జరిగాయి. అర్చకులు కేశవయ్య భూదేవి ,శ్రీదేవి సమేత చెన్నకేశవ స్వామి మూలవిరాట్‌లకు అర్ధరాత్రి నుంచే అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు ఉత్తర ద్వార ప్రవేశం కల్పించారు. సాయంత్రం ఆలయం నుంచి తిక్కస్వామి ఆలయం వరకు పలకల కోలన్న మధ్య స్వామిని పల్లకీ ఊరేగించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నేత, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
యాడికి: మండలంలో పలు గ్రామాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక లక్ష్మీ చెన్నకేశవస్వామి కాలయంలో తెల్లవారుజామున నుంచి భక్తులు ఉత్తర ద్వారం నుంచి స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మండలం నుండే కాక పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు దంపతులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆర్యవైశ్య సంఘం సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.
గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పట్టణంలో లక్ష్మీనరసింహస్వామి, నగరేశ్వరాలయం, రామాలయం, రేణుక ఎల్లమ్మ ఆలయం, ఆర్ఎస్‌లోని గౌతమేశ్వరాలయం, నవ రూప ఆంజనేయస్వామి ఆలయం, అయ్యప్ప ఆలయాల్లో భక్తులు ఉత్తర ద్వారా దర్శనం చేసుకున్నారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజారి వంశీ, ఆయన స్నేహితులు హరిహరుల అలంకారం, సంతాన లక్ష్మి, విష్ణువుతో శ్రీలక్ష్మి, ఉగ్ర నరసింహ అవతారాలను రకరకాల పూలతో చక్కగా అలంకరించి పూజలు నిర్వహించారు.
శింగనమల: శింగనమల, కల్లుమడి గ్రామాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున లక్ష్మీచెన్నకేశవస్వామికి అభిషేకాలు నిర్వహించి, పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనానికి అవకాశం కల్పించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదాలను అందజేశారు.
తాడిపత్రిటౌన్ : పట్టణంలోని చింతలవెంకటరమణ స్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ఏకదశిని పురస్కరించుకొని వేలాది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలు నమో నారాయణ నామ స్మరణతో మార్మోగాయి. శ్రీదేవి భూదేవి సమేత వెంకటరమణస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామిఉత్సవ మూర్తిని గరుడ వాహనంపై ఊరేగించారు. శ్రీవారిని ఎమ్మెల్యే సతీమణి రమాదేవి, తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ కందిగోపుల మురళీప్రసాద్‌రెడ్డి భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.
పెద్దవడుగూరు: మండలకేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా భక్తులకు ఆలయ అర్చకుడు జయరామారావు శర్మ, కమిటీ సభ్యులు భక్తులకు ఏకాదశి విశిష్టతను వివరించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.
బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని కొండమీద వెంకటరమణ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురాతన లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామిని దర్శించుకున్నారు.
పామిడి: స్థానిక తగ్గుదేవాలయం, భోగేశ్వరాలయం, చెన్నకేశవ ఆలయం, దత్త మహాయోగ పీఠంలో శనివారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు, ఈసందర్భంగా ఆయా ఆలయాల్లోని దేవతామూర్తులను శోభాయానంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దేవతామూర్తులను దర్శించుకున్నారు. రుక్మిణీ పాండురంగస్వామిని పల్లకీలో ఊరేగించారు.
గుత్తి రూరల్: తొండపాడు, కొత్తపేట, జక్కలచెరువు, ఇసురాళ్లపల్లి, ధర్మాపురం, బాచుపల్లితో పాటు మరి కొన్ని గ్రామాల్లో శనివారం ముక్కోటి వైకుంఠ ఏకాదశిని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. భక్తులు ఆయా ఆలయాల్లో ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకున్నారు. తొండపాడులోని బొలికొండ రంగనాథస్వామి, మాణిక్య రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొండపాడులో స్వామికి వేకువ జామునుంచి అర్చకులు అభిషేకం, మంగళహారతి, కుంకుమార్చన, ఆకు పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొండపాడు ఆలయ ఈఓ దేవదాసు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



గుంతకల్లులో అనంతపద్మనాభస్వామి



గుంతకల్లులో ఉత్తర ద్వార దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు



స్వామి ఆశీర్వాదం తీసుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి



తాడిపత్రిలో స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సతీమణి రమాదేవి



గుంతకల్లులో అలంకరణలో వేంకటేశ్వరస్వామి



గార్లదిన్నె మండలం కేశవాపురంలో పూజలందుకున్న చెన్నకేశవ స్వామి



నార్పలలో పూజలందుకున్న చెన్నకేశవ స్వామి



యాడికిలో లక్ష్మీచెన్నకేశవ స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



గుత్తి రూరల్: తొండపాడులో పూజలందుకున్న రంగనాథుడు



శింగనమలలో అలంకరణలో లక్ష్మీచెన్నకేవస్వామి



పెద్దవడుగూరులో దర్శనమిస్తున్న చెన్నకేశవస్వామి



బీకేఎస్: ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనారాయణస్వామి



పామిడిలో రుక్మిణీ పాండురంగ స్వామిని ఊరేగిస్తున్న భక్తులు



గుత్తిలో పూజలందుకున్న హరిహరులు

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెద్దవడుగూరు: మల్లేనిపల్లికి చెందిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన లక్ష్మీదేవి(36) కడుపునొప్పి తాళలేక ఈనెల 17న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు, భర్త ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

స్ఫూర్తి ప్రదాత శ్రీనివాస రామానుజన్

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులకు గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ స్ఫూర్తి ప్రదాత అని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల కరెస్పాండెంట్, ఏపీ ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి పేర్కొన్నారు. శనివారం రోటరీపురంలోని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో గణిత దినోత్సవం, శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకుని ఇంటెలిజెన్స్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆలూరి సాంబశివారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు గణిత శాస్త్రవేత్తను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. 20 వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాత గాంచిన గొప్ప మేధావులలో శ్రీనివాస రామానుజం ఒకరన్నారు. అపారమైన మేధస్సుతో భారత దేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగుర వేశారన్నారు. శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా వ్యాప్తంగా ఇంటర్ విద్యార్థులకు శ్రీనివాస రామానుజన్ టాలెంట్ పరీక్ష నిర్వహించారు. ప్లాస్మా అకాడమీకి చెందిన మన్సూర్ అహ్మద్ మొదటి స్థానంలో నిలవగా ఇతనికి ల్యాప్ టాప్‌ను బహుమతిగా అందజేశారు. వివేకాంద జూనియర్ కళాశాలకు చెందిన అబ్దుల్లా, కాగ్నిజెంట్ జూనియర్ కళాశాలకు చెందిన రాజవర్ధన్‌రెడ్డి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీటితో పాటు మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు 50 ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ, టీపీఓ రంజిత్‌రెడ్డి, హెచ్ అండ్‌ఎస్ విభాగం అధిపతి డాక్టర్ గురుసిద్ధప్ప, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఆలూరి సాంబశివారెడ్డి, అధ్యాపకులు

ఎస్ఆర్ఐటీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల కరెస్పాండెంట్, ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి హాజరై మాట్లాడారు. తమ కళాశాలలో చదివిన విద్యార్థులు మంచి కంపెనీల్లో ఉద్యోగాలు చేయడం అభినందనీయమన్నారు. పూర్వ విద్యార్థులు నూతన విద్యార్థులకు దిశా నిర్దేశం చేయాలన్నారు. అనంతరం క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, టీపీఓ రంజిత్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశమైన పూర్వ విద్యార్థులు

దోమల నివారణకు చర్యలు చేపట్టాలని వినతి

తాడిపత్రి: మున్సిపాలిటీ పరిధిలో దోమల నివారణకు తగు చర్యలు చేపట్టాలని కోరుతూ శనివారం మున్సిపల్ కమిషనర్ రవికి సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైనేజీలోని మురుగునీరు రహదారులపైకి అక్కడక్కడా వచ్చి చేరి, దోమల వృద్ధికి కారణమవుతున్నాయన్నారు. దోమలను నిర్మూలించాలని కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్, రమణ, శ్రీనివాస్ యాదవ్, రత్నమయ్య ఉన్నారు.

వైభవంగా హనుమాన్ మాలధారుల శోభయాత్ర

గుంతకల్లు: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి మాలధారుల శోభయాత్ర వైభవంగా నిర్వహించారు. ఆదివారం హనుమద్‌వ్రతం సందర్భంగా శనివారం పట్టణంలో హనుమాన్ మాలధారులు శోభాయాత్ర చేపట్టారు. తిమ్మాపురం వద్ద ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి ఇరుముడులతో కాలినడకన హనుమాన్ సర్కిల్ వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి విగ్రహం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ గురుప్రసాద్, ప్రధాన అర్చకుడు గరుడచార్యులు కమిటీ సభ్యులు తదితరులు నేతృత్వంలో అభయాంజనేస్వామికి ప్రత్యేకపూజాలు నిర్వహించారు. హనుమన్ ఉత్సవ విగ్రహానికి విశేష అలంకరణా గావించి ట్రాక్టర్‌పై కొలువుదీర్చరు. శోభయాత్రను ఆలయ ఈఓ ప్రారంభించి ఊరేగింపుగా బయల్దేరారు. అక్కడి నుంచి పట్టణంగుండా బీరప్పగుడి సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, కన్యకాపరమేశ్వరి దేవస్థానం, మార్కెట్‌రోడ్డు, సత్యనారాయణపేట గుండా కసాపురం దేవస్థానానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ భజంత్రీలు, కాషాయ వస్త్రాలు ధరించిన స్వాములు రామనామ స్వరంతో పట్టణవీధులు మార్మోగాయి. అనంతరం మండలం, అర్ధమండలం మాలాధారులు స్వామివారికి కసాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నియమనిష్ఠలతోపాటు భక్తిగా పూజించి స్వామివారికి ఇరుముడులను సమర్పించారు. ఆలయ ఏఈఓ మల్లికార్జున, ట్రస్టు బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఇదిలా ఉండగా సోమవారం నిర్వహించబోయే హనుమద్ వ్రతానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



శోభయాత్రను ప్రారంభిస్తున్న ఆలయ ఈఓ గురుప్రసాద్

బైక్‌పై నుంచి పడి మహిళకు గాయాలు

గుత్తి రూరల్: లచ్చానుపల్లి శివారులో శనివారం బైక్‌పై నుంచి జారి పడి ఓ మహిళకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన జయమ్మ భర్తతో కలసి బైక్‌పై గుత్తికి బయలుదేరింది. అయితే గ్రామ శివారు మలుపులో వద్ద బైక్ వేగంగా వెళ్తున్న సమయంలో కళ్లు తిరిగి జయమ్మ అదుపు తప్పి కింద పడింది. ప్రమాదంలో గాయపడిన ఆమెను వెంటనే గుత్తి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

యువకుడి ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె: ముకుందాపురంలో ఓయువకుడు శనివారం రాత్రి ఆత్మహత్యకు యత్నించాడు. 108 సిబ్బంది తెలిపిన వివరాలు మేరకు గ్రామానికి చెందినవేణుగోపాల్ అనే యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందుతాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉండగా కుటుంబ సభ్యులు గమనించి 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనకు కారణాలు తెలియాల్సి ఉంది.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం బాటతండా గ్రామానికి చెందిన మల్లినాయక్ అనే వ్యక్తి శనివారం ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు మల్లినాయక్ గత కొన్ని నెలలుగా కుటుంబసమస్యలతో సతమతమవుతుండేవాడు. ఈ క్రమంలో భార్య, భర్తల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. తీవ్ర మనస్తాపం చెందిన మల్లినాయక్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు సేవించాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుల నియామకం

శింగనమల: నియోజకవర్గంలోని ఆరు మండలాలకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగ అధ్యక్షులను నియమించారు. ఈమేరకు పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఆదేశాలు జారీ చేశారు. శింగనమల మండలాధ్యక్షుడిగా దుద్దేకుంట భాస్కర్‌రెడ్డి, గార్లదిన్నె కె.నరేంద్రనాథ్‌రెడ్డి, బుక్కరాయసముద్రం పూల రంగనాథ్, నార్పల వి.అమర్‌నాథ్‌రెడ్డి, పుట్లూరు ఎస్.సుధాకర్‌రెడ్డి, యల్లనూరు అధ్యక్షుడిగా ఎం.వేణుకుమార్ నియమితులయ్యారు.

రాములోరి అంక్షితల ఊరేగింపు

పెద్దవడుగూరు: అయోధ్యలోని రామమందిరం అక్షింతలను శనివారం లక్ష్మంపల్లిలో ఘనంగా ఊరేగించారు. అనంతరం రామాలయంలోని సీతారాముల చెంత అక్షింతలను భద్రపరిచారు.

ఘనంగా అయ్యప్ప గ్రామోత్సవం

పామిడి: పట్టణంలో శనివారం రాత్రి అయ్యప్ప స్వామి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని శోభాయానంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. దారిపొడవునా అయ్యప్ప మాలధారులు భజనలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప మాలధారులు అగ్నిగుండ ప్రవేశం చేశారు.

26న 'ఆడుదాం ఆంధ్రా' ప్రారంభం

తాడిపత్రిటౌన్: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఈనెల 26న పెద్ద పొడమల ఉన్నత పాఠశాలలో ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ రంగారావు తెలిపారు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరవుతారన్నారు.